సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 22 । నవంబర్ । 2024

రైస్ మిల్లు వద్ద నిండిపోయిన ధాన్యం బస్తాలు



● ఎటు చూసినా ధాన్యమే

సంగారెడ్డి జిల్లా సింగూరు డ్యామ్‌కువెళ్లేదారిలో ఎటు చూసినా ధాన్యపురాశులే కన్పిస్తున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల వరి కోతలు పూర్తి కావటంతో రైతులు వడ్లను ఆరబెట్టడంలో నిమగ్నమైపోయారు. వడ్లు ఆరిన తర్వాత బస్తాలలో నింపి దగ్గరలో ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముతున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాల నుంచి లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



సింగూరు వెళ్లేదారిలో ఆరబోసిన ధాన్యం



ధాన్యం ఆరబెడుతున్న మహిళలు



లారీల ద్వారా తరలిస్తున్న ధాన్యం బస్తాలు

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి

సంగారెడ్డి జోన్: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి సూచించారు. మండల కేంద్రమైన ఝరాసంగం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణ చర్యలు, చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల్య వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బాలికల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో 'బేటీ బచావో- బేటీ పడావో' కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బాలికలను ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా 181, 1098 నంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.

చేప పిల్లల పెంపకంతో జీవనోపాధి

ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



హత్నూర పెద్ద చెరువులో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): చేప పిల్లలతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన హత్నూర పెద్ద చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన చేపలు వదిలే కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...చేప పిల్లలతో కొన్ని నెలల తర్వాత మత్స్యకారులకు జీవనోపాధి దొరికి ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు.


నల్లవాగులో మట్టి తొలగింపు

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు కాల్వలో పేరుకుపోయిన మట్టి తొలగింపు పనులు చేపట్టారు. గురువారం మండలంలోని ఖానాపూర్(కె), బీబీపేట శివారులో నల్లవాగు కుడి కాల్వలో మట్టి, పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రాజెక్టు ఎఈ అలేఖ్యరెడ్డి పనులను పరిశీలించారు. యాసంగి సాగుకు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు ముందస్తుగా పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణ సీఐ శివలింగ్ కథనం ప్రకారం పట్టణ సమీపంలో గల ఈద్గా మైదానం ప్రాంతంలో రైల్వే పట్టాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని కనుగొన్నామన్నారు. అతన్ని కిరాతకంగా హత్య చేశారని చెప్పారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ఎవరైనా గుర్తిస్తే జహీరాబాద్ పోలీసు స్టేషన్‌లో లేదా 8712656763, 8712656731 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

పద్మనాభస్వామి ఆలయ ట్రస్ట్ బృందం ఏర్పాటు



సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా చౌట్కూర్ మండలం చేర్యాల్ గ్రామంలోని పురాతనమైన శ్రీ పద్మనాభస్వామి ఆలయానికి ట్రస్ట్ బోర్డు సభ్యుల బృందం ఏర్పాటైంది. ఈ మేరకు దేవాదాయ శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా భానూరి లక్ష్మయ్య, మన్నె నర్సింహులు, జంగిలి మల్లమ్మ, తిమ్మారెడ్డిగారి అంజిరెడ్డి, రోళ్లపాటి సత్యనారాయణలతోపాటుగా ఆలయ ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రధానార్చకుడు రామకృష్ణ శర్మలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ పదవులకు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బోర్డు నూతన అధ్యక్షుడిగా భానూరి లక్ష్మయ్య ప్రమాణ స్వీకారం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించినట్లు సమాచారం.

కాటా x గూడెం

కస్సు బుస్సు



కాటా శ్రీనివాస్‌గౌడ్



గూడెం మహిపాల్‌రెడ్డి

పట్టు కోసం నేతల పాకులాట

- కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

పటాన్‌చెరు: పారిశ్రామికవాడ పటాన్‌చెరులో కాంగ్రెస్ మార్కు రాజకీయాలు మొదలయ్యాయి. కాంగ్రెస్ కుంపటి రాజకీయాలు పటాన్‌చెరులో సెగలు పుట్టిస్తోంది. గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారా? అంటూ ఆ పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారు. తన అన్న వారికే పోస్టింగులు ఇవ్వాలని ఎమ్మెల్యే గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో ఇటీవల జరిగిన జరగబోతున్న బదిలీలు కాటా శ్రీనివాస్‌గౌడ్...గూడెం మహిపాల్‌రెడ్డి మధ్య సఖ్యత లేదన్నది బహిర్గతమైంది. గాంధీభవన్ వేదికగా కాటా శ్రీనివాస్‌గౌడ్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలే చేశారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరినా ఆ పార్టీ కార్యక్రమాల్లో మాత్రం పాల్గొనడం లేదు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆయన పార్టీకి దూరంగా ఉంటున్నారనే వాదన కూడా ఉంది. మరోవైపు కాటా శ్రీనివాస్‌గౌడ్ కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం లేదు. పార్టీపై అలక వహించారని కాటాను పార్టీ పెద్దలు గాంధీభవన్‌కు పిలిపించారని చెప్తున్నారు. గురువారం ఆయన గాంధీ భవన్‌వెళ్లారు. అక్కడ ఆయన కార్యకర్తలతో హంగామా చేశారు. మొత్తం మీద తన అలకకు కారణాలను ఆయన అక్కడ వెలువరించారు. మంత్రి దామోదర రాజనర్సింహతో కూడా కాటా శ్రీనివాస్‌గౌడ్ ముభావంగానే ఉంటున్నారని గతంలో మాదిరిగా తరుచూ కలుసుకోవడం లేదనే ప్రచారం కూడా ఉంది. నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్‌పై పోటీ చేసిన తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అగ్రశ్రేణి నాయకులతో మంచి సంబంధాలు పెట్టుకున్నారు. ఆయన ఇంటికి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వచ్చి వెళ్లారు. మొత్తం మీద గత పదేళ్ల కాలంలో కాంగ్రెస్ అధికారంలో లేని సమయంలో కాటా శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ పేరుకు పర్యాయపదంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆయన ఊసే లేకుండా అధినాయకత్వం వ్యవహరిస్తోందని కాటా వర్గీయులు కినుకు వహించారు.



బది'లీల'లే చిచ్చుకు కారణం!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కాటా శ్రీనివాస్‌గౌడ్ తన అనుకున్న అధికారులకు పటాన్‌చెరులో పోస్టింగులు ఇప్పించుకోవడం సఫలీకృతులయ్యారు. గత రెండు రోజులుగా రాత్రికి రాత్రి పోలీస్‌శాఖలో కొన్ని బదిలీలు జరిగాయి. మరి కొన్ని మారే అవకాశం కూడా ఉంది. దానికి కారణం ఎమ్మెల్యేనని ప్రచారం ఉంది. ఎమ్మెల్యే పోలీస్ శాఖలో తన అనుకున్న వారిని నియమించుకోవాలనే ఎత్తు వేశారు. అందులో భాగంగా కొందరు ఇప్పటికే బదిలీపై వచ్చారు. మరో పెద్ద అధికారి బదిలీ కూడా ఉంది. అది భరించలేక కాటా శ్రీనివాస్‌గౌడ్ గాంధీ భవన్‌వేదికగా గురువారం ఎమ్మెల్యే తీరుపై చిందులేశారు. ఆయనకు సహకరిస్తున్న పార్టీ పెద్దలపై పరోక్షంగా సీఎంపై చిరుబుర్రులాడారు. మిగతా శాఖల సంగతి పక్కన పెడితే పోలీస్ శాఖలో ఎమ్మెల్యేకు కొంత పట్టు తగ్గిందనే ప్రచారం సాగుతుంది. ఎమ్మెల్యేగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలకు బదిలీలే పరిష్కారం అనే ధోరణితో ఎమ్మెల్యే ఎత్తులు వేశారు. దేవాదాయ శాఖలో ఆలయాల చైర్మన్‌లు, ఇతర పదవుల్లోనూ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గాలకు చెందిన వారే నియమితులయ్యారు. ఇలా జరుగుతున్నా ఎమ్మెల్యే ఇప్పటివరకు కిమ్మనలేదు. కానీ తాజాగా ఆయన సీఎంను కలిసి తన సమస్యలను చెప్పుకున్నారని దాంతో తాజా పోలీస్ శాఖ బదిలీలే నిదర్శనమని చెప్తున్నారు. ఇది ఆరంభం మాత్రమేనని పరిస్థితిని గమనించిన కాటా శ్రీనివాస్‌గౌడ్ గాంధీ భవన్ వేదికగా ఎమ్మెల్యేపై తన అక్కసును వెళ్లగక్కారు. కాంగ్రెస్ వినాశనానికే ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

> **అక్రమ కేసులు పెట్టించలేదు**
>
> దశాబ్దంపైగా తాను ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాను. తాను ఎవరిపైనా ఏనాడు తప్పుడు కేసులు పెట్టించింది లేదు. ప్రజాస్వామ్యంలో నిబంధనలకు లోబడి వ్యవహారాలుంటాయి. ఎమ్మెల్యే ప్రమేయంతోనే బదిలీలు ఉంటాయి. రాజకీయ కక్ష సాధింపు ధోరణితో ఏనాడు ఇక్కడ రాజకీయాలు చేయలేదు.
>
> - గూడెం మహిపాల్‌రెడ్డి

కార్మిక సంక్షేమానికి అహర్నిశలు కృషి

కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): కార్మిక సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక నాయకులు వరప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. బొల్లారం పారిశ్రామికవాడలోని ఒస్లోహ్ కోగిఫర్ టర్న్ అవుట్ పరిశ్రమ కార్మికులకు రూ.11,900 మెరుగైన వేతనాన్ని అమలు చేసేలా గురువారం యాజమాన్యంతో చర్చించి తీర్మానించారు. ఈ మేరకు జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో పరిశ్రమ కార్మికులకు నూతన వేతన ఒప్పంద పత్రాలను అందజేశారు. అనంతరం వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ...కార్మిక సంక్షేమమే ఎజెండాగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లేబర్ కమిషనర్‌ను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మాగౌడ్, ముత్యాలరావు, సంతోష్, రంజన్, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులకు ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న యాజమాన్యం

సేవకు సదావకాశం పోలీస్ శాఖ

డీఐజీ రెమా రాజేశ్వరి

- పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్
- హాజరైన కలెక్టర్, ఎస్పీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ, తదితరులు

సంగారెడ్డి జోన్: ప్రజలకు సేవ చేసేందుకు పోలీసు శాఖ కల్పించిన సదావకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఉమెన్ సేఫ్టీ వింగ్, డీఐజీ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. గురువారం చిద్రుప్పలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో తొమ్మిది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకుని, కానిస్టేబుల్స్‌గా విధుల్లో చేరుతున్న సందర్భంగా ట్రైనీ కానిస్టేబుల్స్‌కు పోలీస్ కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ నిర్వహించారు. సైబరాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సీపీఎల్-అంబర్‌పేట్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన 224 మంది స్టైపెండరీ కాడెట్ ట్రైనీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీతోపాటు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేశ్ హాజరై ట్రైనీ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ట్రోఫీలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ...పోలీసింగ్ అనేది నిరంతర శిక్షణ ప్రక్రియన్నారు. కొత్త కొత్త నేరాల ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకుంటూ, అటువంటి నేరాలు మళ్లీ జరగకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు.

ధన, మాన,ప్రాణ రక్షణలో అహర్నిశలు కృషి...

మహిళల భద్రతకు, ప్రజల ధన మాన ప్రాణ రక్షణలో పోలీసు శాఖ అహర్నిశలు కృషి చేస్తోందని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంఘ విద్రోహ శక్తులకు ఎదురు నిలబడి సామాన్య ప్రజలకు భరోసా కల్పించేది పోలీస్ శాఖేనని చెప్పారు. జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ మాట్లాడుతూ...శిక్షణలో భాగంగా నూతన చట్టాలతోపాటు ప్రత్యేక-ప్రాంతీయ చట్టాలు, నేరపరిశోధన, ఇంటెలిజెన్స్-అంతర్గత భద్రత, వ్యక్తిత్వ వికాసం, లాఠీ డ్రిల్ వంటి అంశాలు నేర్పించామన్నారు. నేటి నుంచి పూర్తిస్థాయి కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తూ.. మంచి ప్రవర్తనను కలిగి ప్రజలకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ప్రయత్నంలోనే..



నోటిఫికేషన్ విడుదల కాగానే ప్రణాళికాబద్ధంగా చదువుకున్నా. తొలి ప్రయత్నంలోనే ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రతీ ఒక్కరికి న్యాయం చేసేలా విధులు నిర్వహిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటా. నాకు ఉద్యోగం రావడం నా తల్లి దండ్రులకు ఎంతో సంతోషంగా ఉంది.

-కె.సురేశ్, ఏఆర్ కానిస్టేబుల్, సిరి గిరిపురం, మహేశ్వరం మండలం, రంగారెడ్డి జిల్లా.

బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తూనే..



ఇంతకుముందు బెటాలియన్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తూనే ఏఆర్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యాను. శిక్షణలో భాగంగా అన్ని అంశాలు నేర్చుకున్నాను. విధి నిర్వహణలో ఏ విధంగా ఉండాలో అధికారులు సూచించారు.

-ఎం.ఏ కలీం, ఏఆర్ కానిస్టేబుల్, వెల్జాల్, తలకొండపల్లి మండలం, రంగారెడ్డి జిల్లా

పోస్టాఫీస్ నుంచి పోలీస్ శాఖకు



ఇంతకుముందు పోస్టాఫీసులో అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం చేశాను. నోటిఫికేషన్ విడుదల కాగానే ఉద్యోగం చేస్తూనే ప్రిపేర్ అయ్యాను. రెండో ప్రయత్నంలో ఉద్యోగం సాధించాను. ఉద్యోగం రావడం సంతోషంగా ఉంది.

-ప్రవీణ్, నకిరేకల్, నల్లగొండ జిల్లా

ఫోర్జరీతో ప్లాట్ అమ్మి.. పోలీసులకు చిక్కి

20 ఏళ్ల తర్వాత వెలుగులోకి మోసం

- కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు



ఊరెళ్ల రాజేందర్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తనది కాని ప్లాట్‌ను కాజేయాలనుకుని ఏకంగా ప్లాట్ యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు ఓ వ్యక్తి. ఇరవై ఏళ్ల తర్వాత చేసిన మోసం బయటపడి పోలీసులకు చిక్కగా కోర్టు ఆదేశాల మేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు. కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన శశికళ అగర్వాల్ తెల్లాపూర్‌లోని ఏ బ్లాక్‌లో ఓ ప్లాట్‌ను కొనుగోలు చేసింది. అదే ప్లాట్‌ను 2003లో బీరంగూడలో నివాసముండే ఊరేళ్ల రాజేందర్ ప్లాట్ అసలు యజమాని శశికళ అగర్వాల్ సంతకాలను ఫోర్జరీ చేసి అతడి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తిరిగి ఆ ప్లాట్‌ను తొమ్మిది రోజుల తర్వాత మరొకరికి అమ్మేశాడు. అలా ఆ ప్లాటు చేతులు మారుతూ తెల్లాపూర్ నివాసి భుజంగారెడ్డి పేరు మీదికి వచ్చింది. కాగా, అసలు యజమాని శశికళ అగర్వాల్ 2023లో తన ప్లాట్‌ను రామచంద్రాపురం పట్టణానికి చెందిన రాజు అనే వ్యక్తికి విక్రయించింది. రాజు తన ప్లాట్ వద్దకు వెళ్లగా అక్కడ భుజంగారెడ్డి చేపట్టిన భవన నిర్మాణం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసిన పోలీసులు ప్లాట్ డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపి వేలిముద్రలను పరిశీలించారు. దాంతో ఊరెళ్ల రాజేందర్ ప్లాట్ ఓనర్ శశికళ అగర్వాల్ సంతకాలను ఫోర్జరీ చేసినట్లు తేలింది. దీంతో అతడిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాలమేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

- సమాజాన్ని చైతన్య పరిచేలా ఎగ్జిబిట్‌లు
- ప్రారంభమైన బాలవైజ్ఞానిక ప్రదర్శనలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే దిశగా నూతన ఆవిష్కరణలు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులకు సూచించారు. నేటి బాలలే రేపటి భావి భారత శాస్త్రవేత్తలని అందుకనుగుణంగా సైన్స్ ఉపాధ్యాయులు నూతన పద్ధతులు ఉపయోగించి బోధన అందించాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో బాలవైజ్ఞానిక ప్రదర్శనలతోపాటు నేషనల్ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శన కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...స్థిరమైన భవిష్యత్‌ను నిర్మించడంలో బాల వైజ్ఞానిక ప్రదర్శనల్లో సైన్స్ కీలకపాత్ర వహిస్తుందన్నారు. విద్యార్థులు సైన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. జాతీయస్థాయిలో 3 వేల ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు ఎంపిక కాగా జిల్లా నుంచి 95 ఎగ్జిబిట్‌లు ఎంపిక కావడం గర్వకారణమన్నారు.

జపాన్‌లో ఎగ్జిబిట్

గతంలో జిల్లా నుంచి జాతీయస్థాయిలో ఎంపిక కావడమే కాకుండా జపాన్‌లో ఎగ్జిబిట్‌ను ప్రదర్శించేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా అందించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటివరకు సంగారెడ్డి నుంచి జాతీయస్థాయికి 27 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వెల్లడించారు. ఈసారి కూడా రాష్ట్ర, జాతీయస్థాయికి ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు ఎంపికవుతాయనే ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్‌స్పైర్ అవార్డుల పరిశీలకులు సుబ్రత్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ, సెయింట్ ఆంథోనీస్ పాఠశాలల అధినేత సాల్మోన్‌రెడ్డి, జిల్లా నోడల్ అధికారి లింబాజి, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సర్వే పూర్తి చేయాలి

జిన్నారం (పటాన్‌చెరు): కుటుంబ సమగ్ర సర్వే వివరాలలో తప్పుల్లేకుండా నమోదు చేయడంతోపాటు సర్వేను వేగంగా పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. మండల కేంద్రమైన జిన్నారంలో జరుగుతున్న కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సర్వేపై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దన్నారు. సర్వే వివరాలు కోడ్ రూపంలో రాస్తున్నందున పూర్తిస్థాయి భద్రత ఉంటుందని తెలిపారు. సర్వేవివరాలను గోప్యంగానే ఉంచుతామని సిబ్బంది అడిగిన ప్రతీ సమాచారాన్ని అందివ్వాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయడంతోపాటు తూకం వేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం రైతులకు 48 గంటల్లో డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ జీఎం కొండల్ రావు, అదనపు డీఆర్‌డీవో జంగారెడ్డి, ఎంపీడీవో అరుణారెడ్డి తదితరులు ఉన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

క్లుప్తంగా

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు మానిటర్ చేయాలి

ఏసీపీ సతీష్



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏసీపీ సతీష్

హుస్నాబాద్: బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రతి రోజు మానిటర్ చేస్తూ సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ సతీష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌బీఐతో పాటు పలు బ్యాంక్‌లను ఏసీపీ సతీష్, సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్‌లు సందర్శించారు. బ్యాంక్‌ల్లో ఉన్న సెక్యూరిటీ మేజర్స్ గురించి బ్యాంక్ మేనేజర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. బ్యాంక్‌లో ఏ సంఘటన జరిగినా అలారం సిస్టమ్ పని చేసేలా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్‌లో ఉన్న కిటికీలు, డోర్స్, స్ట్రాంగ్ రూమ్ 15 రోజులకొక్కసారి వాటి పనితీరుపై తనిఖీ చేయాలని సూచించారు. ప్రజలు దాచిపెట్టుకున్న బంగారం, డబ్బులు కాపాడటానికి సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. రాత్రి, పగలు సమయంలో పోలీస్ అధికారులు రోజుకు రెండుసార్లు బ్యాంక్‌లను తనిఖీ చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. మెయిన్ బ్రాంచ్ నుంచి ఇతర బ్యాంక్‌లకు డబ్బులు తీసుకొని వెళ్లేటప్పుడు అన్ని సెక్యూరిటీ మేజర్స్ తీసుకోవాలన్నారు.

సైబర్ వలలో ప్రైవేట్ ఉద్యోగి

రూ.7.16లక్షలు పోగొట్టుకున్న వైనం

పటాన్‌చెరు టౌన్: ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యాడు. మనీ లాండరింగ్ కేసులో సస్పెక్ట్‌గా ఉన్నావని, పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని ఫోన్ చేసి బెదిరించడంతో ఓ ప్రైవేట్ ఉద్యోగి 7.16లక్షలు సమర్పించుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈనెల 18న అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి కాల్ చేస్తున్నామని మనీలాండరింగ్ కేసులో మీ పేరు ఉందని, పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో సదరు ఉద్యోగి అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.7.16లక్షలు వేశాడు. అపరిచిత వ్యక్తి ఇంకా డబ్బులు వేయాలని అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు.. ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

జహీరాబాద్ టౌన్: ఓ హత్య కేసులో సంగారెడ్డి కోర్టు నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధించింది. పట్టణ ఎస్‌ఐ కాశీనాథ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన పవార్ రాజు కుటుంబం జహీరాబాద్‌కు ఉపాధి కోసం వలస వచ్చి చిరువ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా నీలంగా పట్టణానికి చెందిన పవార్ శ్రీకాంత్(23) కూడా జహీరాబాద్‌కు వచ్చి ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నాడు. ఇద్దరి మధ్య స్నేహం కుదరడంతో తల్లి ఆరోగ్యం బాగు లేదని శ్రీకాంత్ రాజు పవార్ వద్ద రూ.10 వేల అప్పు తీసుకున్నాడు. తీసుకున్న అప్పు అడిగినందుకు రాజుపై కక్ష పెంచుకుని హత్య చేశాడు. కేసు పూర్వపరాలను విన్న జిల్లా జడ్జి జి.భవానీ చంద్ర నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు.

కాటేసిన కరెంట్ తీగ

ఝరాసంగం(జహీరాబాద్): అడవి పందుల బెడద నుంచి పంట రక్షణ కోసం అమర్చిన విద్యుత్ తీగ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. దేవరంపల్లి గ్రామానికి చెందిన నసీర్ సాబ్(49) జహీరాబాద్‌కు కుమారుడితో కలిసి వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తు న్న క్రమంలో జీర్లపల్లి గ్రామ శివారులో ఓ వ్యవసాయ పొలం వద్ద నీరు తాగేందుకు వెళ్లా డు. పంట రక్షణ కొరకు వేసిన తీగను గమనించక విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

భర్త ప్రోత్సాహం... స్నేహితురాలి సలహా..

నా ఉన్నతికి ఊతం



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే గ్రూప్స్‌కు సిద్ధం

- రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు
- సాక్షి భవిత ఎంతో దోహదపడింది
- కష్టపడడంతో పాటు ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలి
- సంగారెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్డీ మాధురి

టర్నింగ్ పాయింట్

సంగారెడ్డి జోన్...✍

ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివితే విజయం వరిస్తుంది. నిరాశ, నిస్పృహలతో కృంగిపోకుండా అనుకున్న లక్ష్యం నెరవేరేంత వరకు పట్టుదలతో చదువుకోవాలి. అప్పుడే గమ్యాన్ని ముద్దాడుతాం. అపజయం ఎదురైనా వెనుకడుగు వేయకుండా ముందుకు సాగాలి. చదివే సమయంలో మంచి ఉద్యోగం సాధించి ప్రజలకు సేవచేయాలనే కుటుంబ సభ్యుల సూచన... ఉద్యోగం చేస్తున్న సమయంలో స్నేహితురాలు అందించిన సలహా.. భర్త ప్రోత్సాహంతో ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం.. తన జీవితం ఉన్నతికి టర్నింగ్ పాయింట్ అయింది. సివిల్స్ సాధించాలని ఉన్నా.. ఇంటర్వ్యూ వరకు వెళ్లినా రాకపోయినప్పటికీ ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా గ్రూప్స్‌కు సిద్ధం అయ్యా. 2017లో విడుదలైన ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించా. విద్య, కుటుంబం, ఉద్యోగం.. ఈ స్థాయికి రావడానికి గల కారణాలను అదనపు కలెక్టర్ ఆర్డీ మాధురి సాక్షికి వివరించారు.

బాల్యం-విద్యాభ్యాసం

మాది ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని ఏటూరు నాగారం గ్రామం. పదో తరగతి వరకు హైదరాబాద్‌లో, ఇంటర్మీడియెట్ విశాఖపట్నంలో, నర్సాపూర్‌లోని బీవీఆర్ ఐటీలో ఎంటెక్ పూర్తి చేశారు.

గ్రూప్-1 లో మొదటి ర్యాంకు

2016లో విడుదలైన నోటిఫికేషన్లో గ్రూప్-1 పరీక్ష రాశాను. 2017లో విడుదలైన ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించా. మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ ర్యాంకు సాధించినందుకు గర్వంగా ఉంది. ఎలాంటి కోచింగ్ లేకుండానే సిలబస్ చూసుకొని హైదరాబాద్‌లోని వికాస్ బుక్ స్టోర్‌లో మెటీరియల్ కొనుగోలు చేసి పరీక్షలకు సిద్ధం అయ్యా. రంగారెడ్డిలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా, జగిత్యాల ఆర్డీఓగా విధులు నిర్వహించి.. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా విధులు నిర్వహిస్తున్నా.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే..

ఓవైపు వచ్చిన ఉద్యోగం వదలకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే, ప్రజాసేవ చేయాలని లక్ష్యంతో గ్రూప్స్‌కు సిద్ధం అయ్యా. బెంగళూరులోని ఐబీఎం సాండ్ డిస్క్‌లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేశాను. ఇస్రోలో ఉద్యోగానికి ఎంపికై నప్పటికీ జాయిన్ కాలేదు. యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికాలో ఆరు నెలల పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేశాను. ఓవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు గ్రూప్స్‌కు సిద్ధమై ఉత్తమ ర్యాంకు సాధించానని మాధురి చెప్పుకొచ్చారు.

మా ఆయన అండదండలు

'ప్రియ'మైన సలహా..

బెంగళూరులో ఉద్యోగం చేస్తున్న సమయంలో స్నేహితురాలు ప్రియాంక సలహా, భర్త ప్రదీప్ ప్రోత్సాహంతో గ్రూప్స్‌కు సిద్ధమై పరీక్షలు రాశాను. నేను చదువుకునే క్రమంలో నా కుటుంబ సభ్యులతో పాటు మా బంధువుల ఐఏఎస్ టికే. శ్రీదేవి సూచనలు, సలహాల మేరకు ముందడుగు వేశా. నీవు కూడా భవిష్యత్‌లో ఐఏఎస్ కావాలని తనలాగే సేవ చేయాలని తెలిపేవారు.

శిక్షణలో సమస్యల పరిష్కారం విచారణపై నేర్చుకున్నా

శిక్షణలో ఉన్న సమయంలో సమస్యలను ఏ విధంగా సమస్యలు పరిష్కరించాలి, విచారణ ఏ విధంగా చేపట్టాలి అనే అంశాలు నేర్చుకున్నాను. ప్రజావాణిలో భాగంగా వచ్చే ఫిర్యాదులు త్వరితగతిన ఏ విధంగా పరిష్కరించాలో నేర్చుకున్నా. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించడం తెలుసుకోవడం జరిగింది.

కష్టపడి చదివితే విజయం

ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలి. అప్పుడే విజయం వరిస్తుంది. ఎలాంటి అనుమానాలు పెట్టుకోకుండా, పుకార్లు నమ్మొద్దు. నాకు వస్తుందో లేదోనని ప్రతి ఒక్కరు అనుకుంటారు. అలా ఎవరు అనుకోవద్దు. నాకు జాబ్ వస్తుంది అని అనుకుని నమ్మకంతో చదువుకోవాలి. చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రిపరేషన్ కావాలి. నిజంగా చదువుకునే వాళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

నేను సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా, భర్త ప్రదీప్ ఇన్ఫోసెస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. శ్రీకర్ ఏడవ తరగతి, ఆర్యన్ ఒకటో తరగతి చదువుకుంటున్నారు.



బతుకమ్మ పండుగంటే ఎంతో ఇష్టం

తెలంగాణ ఆచార, సాంప్రదాయాలకు ప్రతీక ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ అంటే ఎంతో ఇష్టం. అదేవిధంగా బాస్కెట్ బాల్ ఆడటం అంటే ఆసక్తి.



సాక్షి భవిత ఎంతో సహకారం

సాక్షి దినపత్రికలో వచ్చే భవిత మెటీరియల్ గ్రూప్స్ ప్రిపరేషన్‌కు ఎంతో దోహదపడింది. భవితలో పరీక్షకు సంబంధించి ముఖ్యమైన ప్రశ్నలతో పాటుగా సిలబస్ వచ్చేది. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు గ్రూప్స్‌కి సంబంధించిన ఫలితాలు విడుదల కాగానే సాక్షి మీడియా ద్వారానే రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చిందని తెలుసుకున్నా.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

కొండపాక(గజ్వేల్): కొండపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. దీంతో రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో కొండపాక హైస్కూల్‌కు చెందిన బాలికల విభాగంలో పూజిత, హారిక, పూజ, శృతి, ఉమామహేశ్వరి, కృష్ణవేణి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. సిర్సనగండ్ల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మహేశ్, రేవంత్, అనిల్ ప్రథమ స్థానం, సోహెల్, నిఖిల్, వినీలా ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. అలాగే.. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నితీశ్, ఖలీద్, ముస్తాక్, అరుణ్, శివాణి జూనియర్ విభాగంలో రాణించడంతో ఎంఈఓ సత్తయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, ఉప్పలయ్య, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఈత పోటీలకు..



ఈత పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సంగారెడ్డి: డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 35వ సౌత్‌జోన్ ఆక్వాటిక్ చాంపియన్ షిప్‌కు విద్యార్థులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ బాలబాలికలకు జిల్లాస్థాయి ఈత పోటీలను గురువారం ప్రారంభించారు. టీఎస్‌జీఎస్ జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ, డీవైఎస్ఓ కాసిం బేగ్ సబ్ జూనియర్, జూనియర్‌లో బాలబాలికలు రాష్ట్రస్థాయికి వివిధ విభాగాల్లో ఎంపికైన వారిని ప్రకటించారు. మహమ్మద్ అబ్దుర్ రెహమాన్ సిద్దిఖ్, అలియా ఫాతిమా, నిషిత బాల్జీ, రితిక, సాహితీ, అబ్దుల్ నజీర్, మహమ్మద్ హుజేర్, వినీత్, విన్సెంట్, మనస్వినిరెడ్డి, అనికాసింగ్, రోషిత్ మోక్షా, అద్మియా వైష్విక్, అద్విక ఆఫ్రాన్, తక్షిత్, వంశీ ఉన్నారు. డిసెంబర్‌లో భూపాలపల్లిలో జరిగే 9వ తెలంగాణ వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ 2024 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్విమ్మింగ్ కోచ్ శేషుకుమార్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు నిఖిల్



మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల చెప్యాల క్రాస్‌రోడ్డులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 9వ, తరగతి చదువుతున్న నిఖిల్ ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘునందన్ రావు గురువారం తెలిపారు. బుధవారం కొండపాక మండలంలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. 22న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నిఖిల్‌ను ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరాములు, మధు, టీచర్లు అభినందించారు.

500 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్

మునిపల్లి(అందోల్): బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ ఆధ్వర్యంలో 500 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు కొండాపూర్ సీఐ వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 20న కంకోల్ టోల్‌ప్లాజా సమీపంలో బుదేరా పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఒక కారు డిక్కీలో పాలిథిన్ కవర్‌లో 500 గ్రాముల ఎండు గంజాయి దొరికిందని అన్నారు. బీదర్ చిద్రి రోడ్‌కు చెందిన రేష్మాబేగం, భర్త జాఫర్ అలీ, బీదర్ గాంధీ గంజ్ భద్రుద్దీన్ కాలనీకి చెందిన జాఫర్ అలీలు ఇద్దరు వ్యక్తులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు విచారణలో తెలిందన్నారు. దీంతో ముగ్గురు వ్యక్తులకు గంజాయి సరఫరా చేసిన మహబూబ్ నగర్‌టౌన్‌కు చెందిన మహమ్మద్ అజీ, మోహమ్మద్ మోహరాజ్ అహ్మద్, ఇల్లియాజ్ ఖాన్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు. గంజాయి సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, త్వరలో పట్టుకుంటామన్నారు. బుదేరా పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ చెన్నూర్ రూపేశ్ అభినందించినట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బుదేరా పోలీస్ సిబ్బంది సుందర్‌రాజ్, మహమ్మద్‌హనీఫ్, గణపతి రావు, పాండుతో పాటు పాల్గొన్నారు.

నిషేధిత మత్తు పదార్థం స్వాధీనం: పంజాబీ హోటల్ యజమాని అరెస్టు



మత్తు పదార్థాన్ని చూపుతున్న పోలీసులు

వెల్దుర్తి(నర్సాపూర్): మాసాయిపేట మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ పంజాబీ దాబాలో గురువారం ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. నిషేధిత మత్తు పదార్థం పాపిష్టి పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ వీణారెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. 128 గ్రా ముల పాపిష్టి మత్తు పదార్థాన్ని స్వాధీన పర్చుకున్నారు. ఇది నిషేధిత పదార్థమని, అమ్మడం, కొన డం నేరమని సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు దాబా యజమాని రవీందర్‌గౌడ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

53 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: అక్రమంగా తరలిస్తున్న 53.50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. బుధవారం రాత్రి పొన్నాల శివారులో సీఐ విద్యాసాగర్ వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో 85 సంచులలో రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఎలాంటి రశీదులు చూపించకపోవడంతో డ్రైవర్ శేఖర్‌ను అదుపులోకి తీసుకొని వాహనాన్ని, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య



కనకయ్య

సిద్దిపేటరూరల్: ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చింతమడకలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాందేని కనకయ్య (44) వ్యవసాయం చేస్తూ, మేకలు మేపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అప్పు చేసి కొన్ని మేకలను కొన్నాడు. తనకు ఉన్న ఎకరం పొలంలో రెండు బోర్లు వేయగా నీరు రాలేదు. దీంతో మరింతగా అప్పుల భారం పెరిగింది. కుమార్తె వివాహం చేసేందుకు తన వద్ద డబ్బు లేవని పలుమార్లు కుటుంబ సభ్యుల వద్ద చెప్పుకుంటూ మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గడ్డి మందు తాగి..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా పరిధిలోని పిట్టలగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టలగూడెంకు చెందిన కాలియా శంకరయ్య(25) మద్యానికి బానిసై వ్యవసాయ పనులు చేయకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 19న గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

వ్యక్తి బలవన్మరణం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మద్యానికి బనిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జగదేవ్‌పూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రొయ్యల బాల్ నర్సయ్య(45) మద్యానికి బనిసగా మారి జీవితంపై విరక్తి చెంది గురువారం జగదేవ్‌పూర్‌లోని ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇద్దరు నిందితుల బైండోవర్



తహసీల్దార్ ఎదుట నిందితులు

రామాయంపేట(మెదక్): చేగుంట మండలం వడియారం వద్ద గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులను గురువారం ఎక్సైజ్ పోలీసులు స్థానిక తహసీల్దార్ రజనీకుమారి ఎదుట బైండోవర్ చేశారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అంజూరాల్, ఝార్ఖండ్‌కు చెందిన రహీం శేఖ్ గంజాయి అమ్ముతూ పట్టుబడ్డారు. బైండోవర్ అనంతరం నిందితులిద్దరిని నర్సాపూర్ కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ విజయ్ సిద్ధార్థ తెలిపారు.

ఏసీబీ అదుపులో పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నంబర్ ఇచ్చేందుకు లంచం డిమాండ్
- ఐలాపూర్ నుంచి బదిలీ అయినా వదలని అధికారి
- అమీన్‌పూర్ మున్సిపాలిటీలో రికార్డులు పరిశీలించిన అధికారులు

పటాన్‌చెరు: గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఐలాపూర్ గ్రామ కార్యదర్శిగా పనిచేసిన సచిన్.. ఇంటికి నంబర్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేశారు. బాధితులు తలారి మల్లేశ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు గురువారం అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయంలో గ్రామ రికార్డులను పరిశీలించారు. అనంతరం సచిన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఐలాపూర్ గ్రామం ఇటీవలే అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనం అయ్యింది. ఈ నేపథ్యంలో పంచాయతీ రికార్డులని మున్సిపల్ కార్యాలయంలో ఉన్నాయి. ప్రస్తుతం ఐలాపూర్ కార్యదర్శి అయిన సతీష్‌ను వెంట బెట్టుకుని వచ్చిన ఏసీబీ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధారాలు లభించడంతో నిందితుడు సచిన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రమేష్ తెలిపారు. ఇదిలా ఉంటే సచిన్ ఇక్కడ నుంచి బదిలీ అయిన తర్వాత కూడా లంచం డిమాండ్ చేయడంపై అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీ కార్యదర్శిగా సచిన్ పనిచేసినప్పుడు తలారి మల్లేశ్ నుంచి రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో రూ.10వేలు సచిన్‌కు ఇచ్చారు. అందుకు సంబంధించిన వీడియో రికార్డులు కూడా మల్లేష్ వద్ద ఉన్నాయి. తాజాగా సచిన్.. మల్లేష్‌కు ఫోన్ చేసి మిగతా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.15 వేలు ఇస్తానని మల్లేశ్ తెలిపారు. అయితే ఈ విషయంపై ఏసీబీ అధికారులకు ముందే ఫిర్యాదు చేశారు. లంచం ఇస్తూ మల్లేశ్ వీడియో రికార్డు చేశారు. ఏసీబీ అధికారులకు లభించిన వీడియో ఆధారంగా సచిన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దాదాపు వంద ఇంటి నంబర్లను కేటాయిస్తూ తప్పుడు రికార్డులు సృష్టించారని సచిన్‌పై అభియోగాలు సైతం ఉన్నాయి.

కాల్చొద్దు.. కలియదున్నేయండి

- వరి కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- దిగుబడి, భూసారంపై తీవ్ర ప్రభావం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



వరికోలు గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విస్తరణాధికారి ప్రణీత(ఫైల్)

కోహెడ(హుస్నాబాద్): వరి పంట కోత తర్వాత రైతులు తమ పొలంలోని వరి కొయ్యలను కాలుస్తూ యాసంగి పంటకు సిద్ధం అవుతున్నారు. దాని వల్ల భూసారం దెబ్బతింటుంది. అలాగే అవసరమైన సూక్ష్మజీవులు చనిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిపై మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను తెలియజేస్తున్నారు.

భూమిలో పోషకాలకు నష్టం

నిప్పుతో భూసారం దెబ్బతింటుందని, సాగుకు ఉపయోగపడే పోషకాలైన నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు ఆవిరైపోవడంతో పాటు భవిష్యత్‌తో పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అలాగే పొగ ద్వారా వాయు కాలుష్యం పెరుగుతుంది. దాని వల్ల రైతులకు ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు తలెత్తనున్నాయి. నిప్పుతో మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని మట్టి జీవచక్రం అస్తవ్యస్తం కానుంది. నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం తగ్గిపోయి పంటలకు ఎక్కువ నీరు అవసరం అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

ఇష్టానుసారంగా వరి కోతలు

హార్వెస్టర్లతో వరికోతలు సాగుతున్నాయి. కంకులను సగం వరకే కోయడంతో కొయ్యకాళ్ల సమస్య తలెత్తుతుంది. దీంతో వాటిని కాల్చడం తప్పడం లేదని రైతులు అంటున్నారు. అదే విధంగా పశుగ్రాసానికి కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరం పొలంలోని పశు గ్రాసానికి రూ.3వేలు చెల్లించి కొనుగోలు చేయడం తప్పడం లేదని వాపోతున్నారు.

భూసార పరీక్షలపై నిర్లక్ష్యం

ఏడాదిలో ఒక్కసారయినా వ్యవసాయ భూముల్లో మట్టి సేకరించి వ్యవసాయ అధికారులు పరీక్షలు చేసిన దాకలాలు లేవు. భూసార పరీక్షలు నిర్వహించి భూమిలో అనుకూలమైన పంట వేయాలని అధికారులు చూచించాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై పనిముట్లు అందించాలి



కొయ్యకాళ్లు నరకడానికి ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై అందించాలి. విత్తనాలకు కూడా రాయితీ ఇవ్వాలి. పంటల సాగుపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి.

– జనగామ యాదగిరి, రైతు, కోహెడ

కొయ్యకాళ్లను కలియదున్నాలి



వరి కొయ్యలను కాల్చడం కన్నా పొలంలోనే కలియదున్నితే కాల్షియం, మెగ్నీషియం లాంటి సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి. అలాగే పంటకు మేలుచేసే సూక్ష్మజీవులు పెరుగుతాయి. భూమిలో నత్రజని శాతం కూడా వృద్ధి చెందుతుంది. రైతులు పరిరక్షణకు భాగస్వాములు కావాలి.

– సతీశ్, ఏఓ, కోహెడ